# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 153 | గురువారం 05, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## ముస్లిం ఓటు బ్యాంకు కోసమే
# కాంగ్రెస్ ఆరాటం



**ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో భారీగా కోతలు**
**హిందూ దేవాలయాలపై దాడులు**
**జరుగుతుంటే నోరు మెదపడం లేదని ఆగ్రహం**
**రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు**
**రాజకీయాలు చేస్తోందని విమర్శలు**
**సనాతన ధర్మంపై జరిగే దాడులను**
**సహించేది లేదు: నితిన్ నబీన్ హెచ్చరిక**

**హైదరాబాద్, (ప్రజాస్వ-**
రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 'విజయ సంకల్ప' సమ్మేళనంలో

..మిగతా 3లో

## ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా...
# ఇంగ్లండ్ తో అమీతుమీకి సై



**అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లోకి ప్రవేశించిన భారత్**
**సెమీస్‌లోఆఫ్ఘనిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం**
**శతకంతో కదం తొక్కిన ఆరోన్ జార్జ్ (115)**
**311 పరుగుల భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన యంగ్ ఇండియా**
**ఫైనల్లో ఇంగ్లండ్‌తో తలపడనున్న భారత్**


**నేషనల్‌బ్యూరో, (ప్రజాస్వరం):**
అండర్ 19 ప్రపంచకప్‌లో భారత యువ జట్టు అదరగొట్టింది. రికార్డు స్థాయి ఛేజింగ్ తో ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన రెండో సెమీ ఫైనల్లో ఆఫ్ఘనిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115) అద్భుతమైన సెంచరీతో చెలరేగగా, విధ్వంసకర హాఫ్ సెంచరీలతో వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఫిబ్రవరి 6న ఇదే వేదికపై జరగనున్న ఫైనల్లో భారత్, ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఆఫ్ఘనిస్థాన్

..మిగతా 2లో

---

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే
# గొడ్డలిపెట్టు

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పిటిషన్ల కొట్టివేత రాజ్యాంగ విరుద్ధమన్న కేటీఆర్**
**సీఎం రేవంత్ ఆదేశాలతోనే స్పీకర్ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపణ**
**వీడియో సాక్ష్యాలున్నా ఆధారాలు లేవనడం హాస్యాస్పదమంటూ ట్వీట్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకుంటున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను వరుసగా కొట్టివేయడం రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు అని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే స్పీకర్ నడుచుకుంటున్నారని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. సోషల్ మీడియాలో స్పందిస్తూ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సంజయ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఫోటోలు, వీడియోలు

..మిగతా 2లో

## సంజయ్..
## బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

**జగిత్యాల ఎమ్మెల్యేకు స్పీకర్ క్లీన్ చీట్**
**కడియం విచారణ ఈ నెల 19కి వాయిదా**
**తాము బీఆర్ఎస్ లోనే**
**ఉన్నామంటూన్న మరో ఇద్దరు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో మరో ఎమ్మెల్యేకు వేటు గండం తప్పింది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన ఈ కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చిట్ ఇచ్చారు. సంజయ్‌పై అనర్హత వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా దానిపై స్పీకర్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంజయ్ పార్టీ మారారనేందుకు సరైన ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. ఇలా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపుల పిటిషన్లు దాఖలు కాగా ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలైన దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై స్పీకర్ నిర్ణయం తెలియాల్సి ఉంది. ఇప్పటి వరకూ స్పీకర్ గడ్డం ప్రసాద్ 8 మందికి పార్టీ ఫిరాయింపుల

..మిగతా 2లో

# కేసీఆర్.. నువ్వేలా
# జాతిపిత అవుతావు?

**పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని**
**దోచుకున్నారని మండిపాటు**
**మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా**
**ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం**
**బీఆర్ఎస్ నాయకులు**
**దోపిడీదారులు అంటూ విమర్శలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
"భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ

..మిగతా 2లో

---

## దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను
# కేంద్రంగా మారుస్తాం

**దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చడమే లక్ష్యమన్న భట్టి**
**సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్ అని వ్యాఖ్యలు**
**ప్రజా ప్రభుత్వం సినీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అవార్డులు పునరుద్ధరించిందని వెల్లడి**
**కమర్షియల్ అంశాలతో పాటు సామాజిక సందేశం ఉన్న చిత్రాలకు ప్రాధాన్యం అని స్పష్టం**
**ఉగాది రోజున ఘనంగా గద్దర్ సినిమా అవార్డుల ప్రదానోత్సవం అని ప్రకటన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
దేశవ్యాప్తంగా ఉన్న సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. బుధవారం నాడు సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలుగు సినీ పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు.ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి నగరాల్లో సినీ పరిశ్రమ విస్తరణకు అవకాశాలు పరిమితంగా ఉన్నాయని, కానీ అన్ని భాషల పరిశ్రమలు హైదరాబాద్‌లో అభివృద్ధి చెందడానికి అనేక సానుకూల

..మిగతా 3లో





## 'నా జోలికొస్తే
## నీ బతుకు రోడ్డుకీడుస్తా'..

**నిధులు ఇచ్చేది మోదీ.. తెచ్చేది తానే అన్న బండి సంజయ్**
**కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్న**
**మా విజ్ఞప్తిని చేతకానితనంగా భావించవద్దని పోలీసులకు హెచ్చరిక**
**నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా అని హెచ్చరిక**
**సిరిసిల్లను కేటీఆర్ నాశనం చేశారన్న బండి సంజయ్**
**తనపై వేల కేసులు పెట్టించారని మండిపాటు**
**తనకు భయపడి సిరిసిల్లలోనే మకాం వేశారని ఎద్దేవా**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కేంద్రం నిధులు పక్కదారి పట్టించింది కేటీఆర్.. కేంద్రం మున్సిపాలిటీలకు వరదల్లా నిధులిస్తే, ఆ నిధులను పక్కదారి పట్టించి కేటీఆర్ సిరిసిల్ల పట్టణాన్ని వరదల్లో మునిగేలా చేశాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో

..మిగతా 3లో

## ఇంతకు మించిన ఆధారాలు
## ఇంకేముంటాయి స్పీకర్ గారు?



**జగిత్యాల ఎమ్మెల్యే ఫిరాయింపు**
**కేసులో స్పీకర్ తీరుపై కవిత ఆగ్రహం**
**ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం**
**ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని విమర్శ**
**గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మీటింగ్‌లో**
**పాల్గొనడం పార్టీ మారినట్టు కాదా అని ప్రశ్న**
**స్పీకర్ తన పదవిలో ఉండి కాంగ్రెస్ నేతగా**
**వ్యవహరిస్తున్నారని ఆరోపణ**
**రాజ్యాంగాన్ని, చట్టసభల ఔన్నత్యాన్ని**
**ఎలా కాపాడతారని స్పీకర్‌ను నిలదీత**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆమె వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యే, గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొంటే అది పార్టీ ఫిరాయించినట్టు కాదా? అని ఆమె సూటిగా ప్రశ్నించారు.ఇంతకంటే బలమైన ఆధారాలు ఇంకేం కావాలని కవిత స్పీకర్‌ను నిలదీశారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ బీఫారాలను సదరు ఎమ్మెల్యేనే పంపిణీ చేసిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ విషయం స్పీకర్ దృష్టికి రాలేదా? అని ఆమె అన్నారు. ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు."రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ స్థానంలో ఉండి మీరు కాంగ్రెస్ పార్టీ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని

..మిగతా 3లో



# పాత్రికేయుల జీవితాలే పాఠాలు

**పదిమంది ప్రఖ్యాత జర్నలిస్టులపై మోనోగ్రాఫ్‌ల ఆవిష్కరణ**
**మీడియా అకాడమీ ఆధ్వర్యంలో చిరు పుస్తకాల విడుదల**
**గుత్తా సుఖేందర్‌రెడ్డి, డా. కే.కేశవరావు చేతుల మీదుగా ప్రారంభం**
**రానున్న తరాలకు స్ఫూర్తినిచ్చే ప్రయత్నమని వ్యాఖ్యలు**
**సోషల్ మీడియాపై జర్నలిస్టుల సమిష్టి చర్చ అవసరం**
**మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
పాత్రికేయ రంగంలో అనేక ఏళ్లు సేవలందించిన పది మంది ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలు తెలిపే చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ మంగళవారం విడుదల చేసింది. విధానమండలి చైర్మన్

..మిగతా 2లో

## హిందుత్వం బీజేపీ డీఎన్ఏ..
# అది ఎజెండా కాదు

**అభివృద్ధే మా అజెండా**
**బీజేపీ మత**
**రాజకీయం చేయదు**
**నిజామాబాద్ ఎంపీ**
**ధర్మపురి అర్వింద్**
**సోనియా..**
**రేవంత్ కన్న నాకే దగ్గర**



**హైదరాబాద్, (ప్రజా-స్వరం):**
హిందుత్వం కోసం రాజకీయాలు చేసే అవసరం బీజేపీకి లేదని, అభివృద్ధి మా ఎజెండా అని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నిజామాబాద్‌లో

..మిగతా 2లో


www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM



# సంజయ్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

**మొదటిపేజీ తరువాయి**

కేసులో క్లీన్ చిట్ ఇచ్చారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు క్లీన్ చిట్ పొందారు.

**నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే : ఎమ్మెల్యే సంజయ్**

పార్టీ ఫిరాయింపు కేసులో తనకు క్లీన్ చిట్ రావడంపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్పందించకాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు. అలాగే తాను బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నానని బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ ఇచ్చానని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని చెప్పారు. తాను ఇప్పటికీ ఆ పార్టీ ఎమ్మెల్యేగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులు ప్రవేశపెట్టి విప్ జారీ చేస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేగానే మద్దతు ఇస్తానని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శాలువ కప్పుకున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు.

**కడియం విచారణ వాయిదా**

పార్టీ ఫిరాయింపు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్నస్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విచారణ ఈ నెల 19న వాయిదా పడింది. ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ నుంచి ఫిరాయింపు నోటీసులు అందుకున్న కడియం బుధవారం విచచారణ కోసం స్పీకర్ ఎదుట హాజరయ్యారు. మరోవైపు కడియంపై పార్టీ ఫిరాయింపు పిటిషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కూడా విచారణకు హాజరై తన వాదనలు వినిపించారు. ఆ సమయంలో వివేకానంద తన వద్ద ఉన్న సాక్ష్యాధారాలను స్పీకర్ కు అందించారు. ఈ క్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇరువురు నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. కాగా మున్సిపల్ ఎన్నికలు, ఫలితాలు అన్నీ పూర్తయ్యాక ఈనెల 19న మరోసారి విచారణకు హాజరు కావాలని స్పీకర్ ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేశారు. కాగా ఈనెల 18న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను కూడా మరోసారి విచారణకు హాజరు కావాలని రెండ్రోజుల క్రితం ఆదేశించారు. వీరిద్దరి విచారణ పూర్తయ్యాక అనర్హత పిటిషన్ పై స్పీకర్ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దానం నాగేందర్ విషయంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

**కాంగ్రెస్ లో చేరావని ఒప్పుకో..**

కడియం శ్రీహరి విచారణ నేపథ్యంలో ఎమ్మెల్యే వివేకానంద కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ లో పనిచేస్తూ బీఆర్ఎస్ లోనే ఉన్నామని చెప్పడం హాస్యాస్పద మన్నారు. నీతులు చెప్పడం ఆపి.. కాంగ్రెస్ లో చేరినట్లు స్పీకర్ ఎదుట అంగీకరించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలోనే ఆ పార్టీ తీర్థం పుచ్చుకుని ఇప్పుడు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ విచారణలో కాలయాపన చేస్తూ.. అనర్హత నుంచి ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు : మాజీ ఎమ్మెల్సీ కవిత**

పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో పాల్గొన్నారంటేనే పార్టీ ఫిరాయించినట్టు కదా అని ప్రశ్నించారు. ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముంటాయని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టేసిన స్పీకర్ నిర్ణయాన్ని కవిత తప్పుబట్టారు. పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ సంజయ్ కు క్లీన్ చిట్ ఇవ్వడం దారుణమన్నారు. ఆధారాలు లేవంటూ పిటిషన్ కొట్టివేసిన స్పీకర్.. రాజ్యాంగ బద్దమైన కుర్చీలో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు అనుకోవాలా? అన్నారు.

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టు

**మొదటిపేజీ తరువాయి**

కళ్లముందు కనిపిస్తున్నా, ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమని అన్నారు. ఈ చర్య ద్వారా స్పీకర్ తన పదవికే అవమానం తెస్తున్నారని, అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాస్తున్నారని మండిపడ్డారు.

జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డే ఆ ఫిరాయింపు ఎమ్మెల్యేను విమర్శిస్తున్న తరుణంలో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికలంటే భయం పట్టుకుందని, అందుకే ఈ నాటకాలాడుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయంతో కాంగ్రెస్ ఇంకా కోలుకోలేదని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాగ్రహం చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని అన్నారు.

ఈ మొత్తం పార్టీ ఫిరాయింపుల వ్యవహారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు రాహుల్ గాంధీకి లేదని స్పష్టం చేశారు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఒక్కరిపైనా చర్యలు తీసుకోకపోవడం వికృత రాజకీయ క్రీడ అని, ఈ చర్యలకు ప్రజాస్వరంలోనే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.



# కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?

**మొదటిపేజీ తరువాయి**

మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లు*, సన్నాసి, దొంగ అయిన నువ్వేలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు.

తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

**స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం**

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని



ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# పాత్రికేయుల జీవితాలే పాఠాలు

**మొదటిపేజీ తరువాయి**

గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే కేశవరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ఈ మోనోగ్రాఫ్ లను ఆవిష్కరించారు. మీడియా అకాడమీ ఆడిటోరియంలో శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇటీవల మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కూడా అందజేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో అనేక ఏళ్లు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలు తెలిపే చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరించడం రానున్న తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. నేటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా తాను మాత్రం పత్రికలు చదివితినే సంతృప్తి చేందుతానని గుత్తా సుఖేందర్ రెడ్డి చెప్పారు. సోషల్ మీడియాను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదని, కానీ దీనిపై జర్నలిస్టులందరూ ఎక తాటిపైకి వచ్చి చర్చించడం లేదా వర్క్ షాప్ నిర్వహించి కొంత మార్పునకు నాంది పలకాలన్నారు. డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభమని, కానీ అదే చరిత్రను మోనోగ్రాఫ్ అందించడం అంత సులభం కాదని, అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే, ఆ వార్త వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసిన జర్నలిస్ట్ భవిష్యత్తు తరాలకు దారి చూపిన వారవుతారన్నారు. . ప్రముఖ పాత్రికేయులైన అబిద్ అలీఖాన్, డి.సీతారామ్, బేతనబొట్ల నాగేశ్వరరావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎం.ఎస్. ఆచార్య, ఎ.బి.కె. ప్రసాద్, జి.ఎస్.వరదాచారి, సి.రాఘవాచారి, వి.హనుమంతరావు, ఆదిరాజు వెంకటేశ్వరరావులపై మీడియా అకాడమి ప్రచురించిన 10 చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ చేసుకున్నట్లు ఆయన వివరించారు.

**మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం..**

అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరమని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చి వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. మరణించిన జర్నలిస్టుల కోసం ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు మంజూరు చేయడంతోపాటు ఐదేళ్ల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



## హిందుత్వం బీజేపీ డీఎన్ఎ..
# అది ఎజెండా కాదు

**మొదటిపేజీ తరువాయి**

బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాదు కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి కార్పొరేషన్ కు బకాయి పడ్డ రూ. 8.16 కోట్లు ఎగవేత ధోరణితో ఇంత కాలం చెల్లించకుండా ఉన్నారని, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ కోసమే అస్తిపన్ను బకాయిలు రూ. 8.16 కోట్లు కట్టాడని అర్వింద్ అన్నారు. ఆయన ఇన్నాళ్లుగా డబ్బులేక కాదని, డబ్బులు పుష్కలంగా ఉన్నా చెల్లించే నియ్యత్ లేక కార్పొరేషన్ కు చెల్లించలేదన్నారు. అంత పెద్ద మొత్తాన్ని కట్టించింది మేమేనని అర్వింద్ అన్నారు. ఇన్ని రోజులు కట్టిచ్చేటోళ్లు లేరని, ఇప్పుడు కట్టించేటోళ్లు కక్కించెటోల్లచ్చింద్రు కాబట్టే రూ. 8.16 కోట్లు కట్టాడని అర్వింద్ అన్నారు. మేయర్ పదవి కోసం ఒక్క రోజులో అంత పెద్ద మొత్తంలో కార్పొరేషన్ కు చెల్లించిన వ్యక్తి రేపు మేయర్ అయితే నిలువు దోపిడీ జరుగుతదని, కార్పొరేషన్ లో బహిరంగ దోపిడీ జరుగుతదని అర్వింద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందూరు నగరాన్ని పూర్తిగా దోచుకుంటాడన్నారు.

**17 ఏళ్లుగా ఎందుకు కట్టలే..**

న్యాయ బద్ధంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను 17 యేళ్లుగా ఎందుకు చెల్లించలేదో, కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఒక్క రోజులోనే ఎందుకు చెల్లించారో ప్రజలకు వివరించాలన్నారు.

**లాటరీ ఏమైనా తగిలిందా?**

లంకెబిందెలు దొరికాయా..? అని అర్వింద్ ప్రశ్నించారు. 17 ఏళ్లుగా పన్ను కట్టకుండా ఏ కార్పొరేషన్ నైతే మోసం చేశారో, అదే కార్పొరేషన్ కు మేయర్ కావాలను కుంటున్నారని అర్వింద్ ఎద్దేవా చేశారు. ప్రజలను మోసం చేసిన వ్యక్తికి పోటీ చేసే నైతికత కూడా లేదన్నారు. అలాంటి వ్యక్తి రేపు మేయర్ అయితే నిజామాబాదు కార్పొరేషన్ ను శ్రీరాముడే కాపాడాలని అర్వింద్ ఆవేదన వ్యక్తం చేశారు. నైతికత, బాధ్యత లేకుండా ప్రజలకు శఠగోపం పెట్టాలనే నైజం నరేందర్ రెడ్డిదన్నారు. ఇలాంటి వారిని ఓటు ద్వారానే శిక్షించాలని అర్వింద్ ప్రజలకు పిలుపునిచ్చారు. 19వ డివిజన్ లో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలన్నారు. ఇలాంటి వారిని గెలిపిస్తే సమస్యలెవరికి చెప్పుకుంటారని ప్రజలను ప్రశ్నించారు. సోనియా రేవంత్ కంటే నాకే దగ్గరని, అయినా కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకి కాబట్టే నేను కాంగ్రెస్ లోకి వెళ్లలేదన్నారు.

ప్రతీ రూపాయి ప్రజల కోసం ఖర్చు పెట్టి అభివృద్ధి చేయడమే బీజేపీ అజెండా అని అర్వింద్ అన్నారు. వినీతిపరులకు, పార్టీ మారిన వారికి బీజేపి టికెట్ ఇవ్వలేదన్నారు. బీజేపీ కి ప్రజలు ముందు.. పార్టీ సెకండ్ అని ఇదే మా ఎజెండా అన్నారు. స్వచ్ఛ పాలన కోసం బీజేపీకి ప్రజలు ఓటేయాలని ప్రజలను కోరారు. నిజామాబాదు కార్పొరేషన్ లో బీజేపీ మేయర్ పదవి గెలిస్తే ఏ వర్గానికి, ఓటు బ్యాంక్ కు లొంగకుండా నిజామాబాద్ లో ఆక్రమణలు తొలగిస్తామని అర్వింద్ నగర ప్రజలకు హామీ ఇచ్చారు. అవినీతిరహిత పాలనను, సుపరిపాలనను అందిస్తామన్నారు. బీజేపీ మేయర్ అభ్యర్థిని ఎవరినేది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. మెజారిటీ, మైనార్టీ కాదు అభివృద్ధి ఎజెండా గా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. నిజామాబాదుకు వందే భారత్ తెచ్చే బాధ్యత నాదన్నారు.



# ఫైనల్లోకి దూసుకెళ్లిన టీమిండియా... ఇంగ్లండ్ తో అమీతుమీకి సై

**మొదటిపేజీ తరువాయి**

నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు పెద్దగా రాణించని ఆరోన్ జార్జ్, కీలకమైన సెమీస్‌లో బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లతో 115 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) మెరుపు ఇన్నింగ్స్‌తో శుభారంభం అందించాడు. ఫీల్డర్లు రెండుసార్లు క్యాచ్‌లు జారవిడిచిన అవకాశాన్ని సూర్యవంశీ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. అనంతరం కెప్టెన్ ఆయుష్ మాత్రే (39 బంతుల్లో 62) కూడా వేగంగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.

భారత ఛేదనలో భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించాయి. తొలి వికెట్‌కు జార్జ్, సూర్యవంశీ 90 పరుగులు జోడించగా, రెండో వికెట్‌కు జార్జ్, కెప్టెన్ మ్హాత్రే కలిసి 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇక మూడో వికెట్‌కు విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38 నాటౌట్)తో కలిసి జార్జ్ మరో 96 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చాడు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్, నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫైసల్ షినోజాడా (93 బంతుల్లో 110), ఉజైరుల్లా నియాజీ (86 బంతుల్లో 101 నాటౌట్) అద్భుత సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్, కనిష్క్ చౌహాన్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ, మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు.



ఈ విజయంతో భారత్ మొత్తమ్మీద పదోసారి అండర్19 ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించగా, వరుసగా ఆరోసారి తుదిపోరుకు చేరడం విశేషం.

# దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తాం

మొదటిపేజీ తరువాయి

అంశాలు ఉన్నాయని భట్టి విశ్లేషించారు. సకల భాషల చిత్ర పరిశ్రమలు హైదరాబాద్‌కు తరలివస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లకు, రచయితలకు, దర్శకులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ సినీ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారనుందని, ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని వెల్లడించారు.

గత ప్రభుత్వం దశాబ్దాలుగా సినిమా అవార్డులను నిర్లక్ష్యం చేసిందని, కానీ తమ ప్రభుత్వం సినీ రంగానికి తిరిగి పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తోందని భట్టి వివరించారు. సమాజం కోసం, కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని ఆయన కొనియాడారు. తెలంగాణ కళలు, సంస్కృతి, విప్లవ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి గద్దర్ అని, అందుకే ఆయన పేరు మీద గత ఏడాది నుంచి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు.

గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డుల ఎంపిక ఉంటుందని భట్టి హామీ ఇచ్చారు. గద్దర్ అవార్డుకు ఎంపికయ్యే సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు బలమైన సామాజిక సందేశం ఉండేలా చూడాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఈ నెల 6 నుంచి అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 19న ఉగాది పర్వదినం నాడు అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముంటాయి స్పీకర్ గారు?

మొదటిపేజీ తరువాయి

అనుకోవాలా? అదే నిజమైతే భారత రాజ్యాంగాన్ని, చట్టసభల ఔన్నత్యాన్ని మీరు ఎలా కాపాడగలుగుతారు?" అంటూ కవిత స్పీకర్ తీరును తప్పుబట్టారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో స్పందించారు.



## కుటుంబ కలహాలు.. రంగారెడ్డి జిల్లాలో
# మహిళా న్యాయవాది దారుణ హత్య

- మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో పొలం వద్ద న్యాయవాది స్వప్న హత్య
- ఆస్తి గొడవల నేపథ్యంలో హత్య
- మెడపై కత్తితో నరికి హత్య చేసిన సోదరుడు



**మొయినాబాద్ ఫిబ్రవరి 04(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లాలో దారుణం జరిగింది. మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో పొలం వద్ద మహిళా న్యాయవాది స్వప్న హత్యకు గురయ్యారు. సోదరుడే ఆమె మెడపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమెను హత్య చేసినట్లు తెలుస్తోంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో మొయినాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్వప్న చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ క్రమంలో బుధవారం పొలం వద్ద పంచాయితీ జరుగుతుండగా సోదరుడు స్వప్నను హతమార్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**న్యాయవాదుల ధర్నా**

లాయర్ స్వప్న హత్యను నిరసిస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్‌బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు.

## రూ. 15 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి
# పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఎస్ఈ

**హైదరాబాద్ ఫిబ్రవరి 04(ప్రజాస్వరం):**

అవినీతి నిరోదక శాఖ అధికారులకు మరో ప్రభుత్వ లంచగొండి అధికారి పట్టుబట్టాడు. నగరంలోని జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్‌లో ఎస్ఈగా పనిచేస్తున్న చిన్నారెడ్డి పై బుధవారం దాడులు జరిపి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. బాధితుడి నుంచి రూ.15 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు జోనల్ కార్యాలయంలో ఇంకా తనిఖీలు నిర్వహిస్తున్నారు.



## ప్రీమియర్ లీగ్ డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవితమ్మ

**దమగ్నాపూర్,ఫిబ్రవరి04 (ప్రజాస్వరం):**

చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ తండ్రి స్వర్గీయ. గవినోళ్ళ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన దమగ్నాపూర్ ప్రీమియర్ లీగ్ డిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ సతీమణి కవితమ్మ మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.





# ముస్లిం ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ ఆరాటం

మొదటిపేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపడం లేదని, ఆలయాల భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారని అన్నారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు చూస్తోందని అన్నారు. బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత విధిస్తోందని ఆరోపించారు.

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లించవలసివస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ రైళ్లను ఇచ్చామని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.



# 'నా జోలికొస్తే నీ బతుకు రోడ్డుకీడుస్తా'..

మొదటిపేజీ తరువాయి



బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగులో ఆయన పాల్గొని కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. కేటీఆర్ సిరిసిల్లను నాశనం చేశాడని, వర్షాకాలం వరదలు వస్తే సిరిసిల్లలో పలు కాలనీలతో పాటు మొన్న కట్టిన కలెక్టరేట్ కూడా నీట మునిగి, కలెక్టర్ ట్రాక్టర్‌లో రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి తనపై వేల కేసులు పెట్టించాడని, ఇప్పుడు నోటీసులు పంపిస్తున్నాడని మండిపడ్డారు. కేటీఆర్ నువ్వు చేసిన అరాచకాలు నీచ పనులన్నీ బయట పెడతానని, నా జోలికి వస్తే, నీ బతుకు రోడ్డుకీడుస్తానంటూ ధ్వజమెత్తారు.

**రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయి..**

సిరిసిల్ల ప్రజలు కేటీఆర్ కంటే తనకే మెజారిటీ ఓట్లు వేశారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు 2 లక్షల 40 వేల మెజారిటీ ఇచ్చారని గుర్తుచేశారు. నాకు భయపడి కేసీఆర్ కొడుకు సిరిసిల్లలోనే అడ్డా వేసి, ఓటుకు రూ.5 నుండి 10 వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడని ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు గాంధీభవన్‌లోనే సంసారం చేస్తున్నారని, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ రాజకీయం వ్యభిచారం చేస్తుందని, అన్ని ఆధారాలున్నా స్పీకర్ కేసు కొట్టి వేయడం దారుణమన్నారు. ఇలాంటి తీర్పులతో ప్రజాస్వామ్యం అపహాస్యమౌతుందని, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిపై మచ్చపడి చరిత్రహీనులు కావద్దని కోరారు. సిరిసిల్లలో వస్త్ర మొత్తం పరిశ్రమ ఉంటే, కేవలం కమిషన్ల కోసం నూలు డిపోను వేములవాడలో ఏర్పాటు చేశారన్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లకు ఏ నిధులు ఇవ్వలేదని, నేత కార్మికులకు ఉపాధి కల్పించడంలో రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు.

సిరిసిల్ల మున్సిపాలిటీలో బలవంతంగా ఏడు గ్రామాలను కలిపి అక్కడి ప్రజలకు ఉపాధి హామీ పని లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు విలువైన గ్రామాలను గ్రామపంచాయతీలుగా చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కేంద్రం నుంచి కోట్ల రూపాయల నిధులు తీసుకువస్తే వాటిని వృథా చేస్తున్నారని, కేంద్రం ఇచ్చిన నిధుల లిస్టును కేటీఆర్‌తో సహా అందరికీ పంపిస్థానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, ఓట్లు మీరు వేస్తే సిరిసిల్లను తాను అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి జే సంఘప్పతోపాటు, 39 వార్డుల అభ్యర్థులు, పార్టీ జిల్లా నేతలు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ భాధ్యతగా విధులు నిర్వర్తించాలి : ఎస్పీ రోహిత్ రాజు

- మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ

**భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి 04 (ప్రజాస్వరం):**



మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు.ఇందులో భాగంగానే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ 08 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,04 స్టాటిక్ సర్వేలయన్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కొత్తగూడెం కార్పొరేషన్,ఇల్లందు,అశ్వారావుపేట మున్సిపాలిటీలకు ఈ నెల 11వ తేదీన జరగనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 101 పోలింగ్ స్థానాలలోని 288 పోలింగ్ కేంద్రాలలో ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రాలు 148, సున్నితమైన పోలింగ్ కేంద్రాలు 125 మరియు 15 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు.మున్సిపాలిటీల వారీగా సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల పోటీలో నిలుచున్న అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల వద్ద నుండి అనుమతులు పొందిన తర్వాతనే తమ ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. అనుమతులు లేనియెడల ఎన్నికల నియమావళి ప్రకారం అట్టి అభ్యర్థులపై కేసుల నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఓటర్లను ప్రలోభపరిచే విధంగా ఎవరైనా నగదు,మద్యం,ఇతరత్రా సామాగ్రిని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ,పాల్వంచ డిఎస్పీ సతీష్‌కుమార్,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్,1టౌన్ సీఐ కరుణాకర్,3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి,పాల్వంచ సీఐ సతీష్,ఇల్లందు సీఐ సురేష్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు మరియు ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది



- రుద్రారం లో అమెజాన్ కంపెనీ ఆధ్వర్యంలో అంగన్వాడి స్కూల్ ప్రారంభం
- ముఖ్యఅతిథిగా హాజరైన రుద్రారం గ్రామ సర్పంచ్ గొల్లగూడెం యాదిరెడ్డి

**షాబాద్, ఫిబ్రవరి 4(ప్రజాస్వరం):**

షాబాద్ మండలంలోని రుద్రారం గ్రామంలో అమెజాన్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా అంగన్వాడి స్కూల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రుద్రారం గ్రామ సర్పంచ్ గొల్లగూడెం యాది రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంగన్వాడి స్కూల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ యాది రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషణకు అంగన్వాడి కేంద్రాలు కీలకమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

**ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న విష్ణువర్ధన్ రెడ్డి**

రుద్రారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి ప్రజాసేవలో పేదల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యా-సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డిమాట్లాడుతూ పిల్లల భవిష్యత్తే గ్రామ భవిష్యత్తని, అందుకే విద్య, ఆరోగ్యం, మహిళా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రుద్రారం గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవసరమైన ప్రతి సహాయం చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండ స్వర్ణలత సతీష్ కుమార్,బండ నర్సింలు,కావలి రమేష్,రుద్రారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి మాణిక్యం, చెవిటి రవి,అల్లవాడ బాలయ్య, నర్సింలు,గణేష్,ఆనందం. సురేష్,బీసీ సేన షాబాద్ మండల యువజన అధ్యక్షులు బండ అజయ్ కుమార్,మాణిక్యం రెడ్డి, దయాకర్,మహేష్,నాని, ప్రశాంత్,అజీమ్,ఆసిఫ్,గ్రామ పెద్దలు,మహిళలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలి





- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపు**

**వికారాబాద్, ఫిబ్రవరి 04 (ప్రజా స్వరం):**
సామాజిక న్యాయం, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ సామాజికపరంగా, వివక్షతో కూడిన సమాజంలో మార్పు రావాలన్న సదుద్దేశంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సమానత్వం, న్యాయం, గౌరవం కోసం నిలబడాలని, ఏ రూపంలోనైనా అన్యాయని ఎప్పుడూ సమర్థించవద్దని కలెక్టర్ సూచించారు. భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని, రాజ్యాంగ సూత్రాలను సమర్థిస్తూ న్యాయమైన, సామరస్య పూర్వకమైన, సాధికారత కలిగిన తెలంగాణ మరియు భారతదేశ కోసం కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్, జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డిబిసిడిఓ మాధవ రెడ్డి లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవగాహనతోనే మార్పు సాధ్యం




- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (ప్రజాస్వరం):**
"అరైవ్ అలైవ్" లో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ నూతనంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రోడ్డు ప్రమాదంలో అతివేగంతో ప్రమాదానికి గురైన కారును వాహనదారులకు కనిపించే విధంగా "కుప్టి ఘాట్" రోడ్ లో ఏర్పాటుచేసి ఈ రోజు దానిని ప్రారంభించడం జరిగింది. ఈ సంవత్సరం ప్రమాదాలను తగ్గించి ప్రాణం విలువ తెలిపాలని ప్రజలకు అవగాహనతోనే సాధ్యమవుతుందని వివిధ రకాలైన ప్రజాహిత కార్యక్రమాలతో ప్రజలకు చేరుకోవడం జరుగుతుంది. అందులో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వేగం వల్ల ప్రాణం పోతుందనే విషయాన్ని తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ప్రజలు వీటిని దృష్టిలో ఉంచుకొని వేగాన్ని తగ్గించి, వాహన నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ లాంటివి చేయకుండా ఉండాలని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యా అవకాశాలు ఉంటాయని గుర్తు చేశారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి కారణమవుతుందని విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ప్రతి వాహనదారుడు గమనిస్తూ వాహనాన్ని నడపాలని తెలిపారు. ఇలాంటి వాటిని చూసి నేర్చుకొని ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని తెలిపారు. ఈ కారును జిల్లా పోలీసులు మరియు కేఎన్ఆర్ హైవే సంస్థ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ సంస్థ సిబ్బంది ఇచ్చోడా సీఐ బండారి రాజు, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



- **జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి**

**వికారాబాద్, ఫిబ్రవరి 4 (ప్రజాస్వరం) :**
ఎన్నికల నిబంధనల మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా, సామరస్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా సహకరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు జి. రవి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ బరిలో పాల్గొంటున్న అభ్యర్థులకు ఎన్నికల నియమావళి , ప్రచార సరళి, వివిధ అనుమతులు, ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేస్తున్న వివరాల సమర్పణ తదితర అంశాలపై చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు జి.రవి పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలోకి దిగారని, ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా ఎన్నికల నిర్వహించుకునేలా అందరి సహకారం అవసరం అన్నారు. అభ్యర్థులు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకునేందుకు అదేవిధంగా మైకుల వినియోగానికి కూడా ముందస్తుగానే అనుమతులు పొందాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ప్రార్థన స్థలాల్లో ప్రచారం చేయకూడదని, వ్యక్తిత్వాన్ని అవమానపరిచే విధంగా ప్రచారాలు నిర్వహించకూడదని ఆయన అభ్యర్థులకు సూచించారు. రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్రంగా పోటీచేసే అభ్యర్థులకు కూడా అన్ని నిబంధనలను వర్తిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ఓటర్లందరికి బూతు స్థాయి అధికారుల ద్వారా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వెళ్లే క్రమంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 17 గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒక కార్డును పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చేలా అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు తెలియజేయాలని ఆయన తెలిపారు. పోలింగ్ కు 48 గంటల ముందుగానే ప్రచారాలు పూర్తి చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికలు పూర్తి అయిన 45 రోజుల లోపు ఎన్నికల్లో ఖర్చు చేసిన పూర్తి వివరాలను సమర్పించాలని లేనిపక్షంలో గెలిచిన అభ్యర్థుల ఎన్నికను రద్దు చేయడం జరుగుతుందనే విషయాన్ని అభ్యర్థులు గుర్తించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీ పైనే ఉంది

- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు, ఫిబ్రవరి 4 ప్రజా స్వరం) :**
తాండూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వార్డ్ నెంబర్ 35 లో కాంగ్రెస్ పార్టీ వార్డ్ కార్యాలయాన్ని బుధవారం తాండూరు ఎమ్మెల్యే ఉయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ 35 వార్డు అభ్యర్థి అఫ్షామానియ నూర్ అహ్మద్, వార్డు నెంబర్ 2 అభ్యర్థి ప్రత్యుష మెహన్ లను చేతి గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ పట్టణ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకీ ఓటేయ్యాడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫథకాలు మా అభ్యర్థుల ప్రచార బ్రహ్మాస్త్రాలు అని అన్నారు. రెండెళ్ళ కాలంలో తాండూర్ పట్టణంలో దాదాపు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేశాం అని తెలిపారు. శివాజీ చౌక్ నుండి మల్ రెడ్డి పల్లి వరకు 2 కోట్లతో నూతన రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 లో భాగంగా దాదా 27 కోట్ల రూపాయలతో త్రాగునీటి వాటర్ ట్యాంకులు నిర్మించడం జరుగుతుంది అని చెప్పారు. గతంలో వర్గపోరంతో తాండూర్ మున్సిపల్ కౌన్సిల్ కూడ సరిగ్గా నిర్వహించ లేదని విమర్శించారు. గత పాలకులు నిర్లక్ష్యంతో మున్సిపల్ సమస్యలను పట్టించుకోలేదు అని అన్నారు తాండూర్ ప్రజలందరూ అధికార పార్టీకీ ఓటు వేసి అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వండి అన్నారు అనంతరం వార్డ్ నెంబర్ 35 నుండి పలువురు కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ధారసింగ్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రవీగౌడ్ , మాజీ కౌన్సిలర్స్ సర్థార్ ఖాన్, ఇక్బాల్, ప్రభాకర్, భీంశంకర్ పాల్గొన్నారు.

# పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ



- **తాండూరు పట్టణంలో 7,8 వార్డుల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు**
- **బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల ప్రచారం**

**తాండూరు, ఫిబ్రవరి 4 (ప్రజాస్వరం):**
సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు నిరంతరం అండగా ఉంటుందని తాండూరు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం తాండూర్ పట్టణంలోని 7 8 వార్డుల్లో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ వార్డులోని రాజు గృహకల్ప ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ నగర్, హరిహర టౌన్ లలో మౌలిక వసతుల కల్పనకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయా కాలనీల్లో సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నికల తర్వాత కృషి చేస్తానని తాండూరు నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. తాండూరు పట్టణంలోని 7,8 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు బాతుల నాగరాజు, కరాటే సాయప్ప తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డ్ నెంబర్ 7 ఎన్టీఆర్ నగర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందని తెలిపారు. మిగిలి ఉన్న సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి, కౌన్సిలర్ అభ్యర్థి బాతుల నాగు కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే, కాలనీలో నెలకొని ఉన్న అనేక సమస్యలను పరిష్కరిస్తానని కాలనీవాసులకు ఆయన భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే రాజీవ్ గృహకల్ప ,ఇందిరమ్మ కాలనీలో పెద్ద ఎత్తున ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణానికి దూరంగా ఉన్న రాజీవ్ గృహకల్ప ఇందిరమ్మ కాలనీలోని ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు ఈ వార్డును తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చి, పోలీస్ అవుట్ పోస్ట్ త్వరలోనే ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలలో మరింత అభివృద్ధి జరగాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో 7వ కౌన్సిలర్ అభ్యర్థి బాతుల నాగు, 8వ అభ్యర్థి తలారి సాయప్ప, వార్డ్ ఇంచార్జ్ సీనియర్ నాయకులు లొంక నర్సింలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జుబేర్ లాల, బాతుల వెంకటయ్య, అబ్దుల్ రాహుఫ్, శివ కుమార్, వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇయ్యలే



- **మంత్రి వివేక్ వెంకటస్వామి,**

**మెదక్ ఫిబ్రవరి 04 (ప్రజా స్వరం) :**
మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మెదక్ పట్టణం 30 వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ వార్డు కార్యాలయాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు లతో కలిసి ప్రారంభించారు. అనంతరం 14, 15 వార్డుల్లో మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని, పదేండ్లు డబుల్ బెడ్ రూం ఇళ్ళు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. తమ ప్రభుత్వం అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని చెప్పి మిషన్ భగీరథ పేరుతో 65 వేల కోట్లు మింగింద్రు అన్నారు. గతం లో నిరు పేదలు రేషన్ లో ఇచ్చే దొడ్డు బియ్యం తినలేక అమ్ముకునే వారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలు మంచి భోజనం చేయాలని సన్న బియ్యం ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, మన ప్రభుత్వం వచ్చాకే అందరికి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. బి ఆర్ ఎస్ పాలన లో ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగించారని అన్నారు. వచ్చే రెండు నెలల్లో అర్హులైన వారందరికి పెన్షన్లు సైతం ఇస్తామని అన్నారు. మెదక్ నియోజకవర్గానికి 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇచ్చామని, రాష్ట్రంలోని మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. మెదక్ లో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో ఇక్కడ చదువుకొని డాక్టర్లు అయ్యే మంచి అవకాశం ఏర్పడిందని అన్నారు. మీరు మన అభ్యర్థులను గెలిపిస్తేనే తాము సీఎం తో కొట్లాడి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థులు దొంతి నరేష్, లక్ష్మి లను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పదేండ్లు ఇళ్ళు ఇస్తామని ప్రజలను మోసం చేసిందని అన్నారు. మన ప్రజా ప్రభుత్వం రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, మరి కొందరికి రెండవ విడత తో ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు పదేళ్ల తర్వాత ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దె అన్నారు. కొత్తగా రేషన్ కార్డు ఇవ్వడమే కాకుండా ఇచ్చిన వాటితో పాటు గతంలో ఉన్న రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క కులాన్ని, మతాన్ని అందరిని సమానంగా చూసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోతున్నామనే భయంతో ఓట్లు వేసుకునేందుకు రైతు బంధు డబ్బులు వేశారని అన్నారు. ఏడుపాయలకు గతంలో ఏ సీఎం రాలేదని, మన సీఎం రేవంత్ రెడ్డి ఆలయానికి వచ్చి 35 కోట్ల అభివృద్ధి పనులకు నిదులిచ్చారని అన్నారు. గత పాలకులు ఏడుపాయలకు 100 కోట్లు ఇస్తామని చెప్పారని, కానీ పేపర్లకే పరిమితమైంది ఎద్దేవా చేశారు. బి ఆర్ ఆర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మెదక్ చర్చికి ఒక్క రూపాయి ఇవ్వాలె, మన సీఎం రేవంత్ మన చర్చి 29.30 కోట్లు ఇచ్చారని అన్నారు. వరదలు వచ్చినప్పుడు మన ప్రభుత్వం వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడామని, వరదలు వస్తే సీఎం రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి, వరదల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన వ్యక్తులకు పరిహారం ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, 14, వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దొంతి లక్ష్మి, 15 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దొంతి నరేష్ గౌడ్, 30 వ వార్డు అభ్యర్థి అరుణర్తి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారంలో బీఆర్ఎస్ నేతల సమావేశం




**జిన్నారం, ఫిబ్రవరి 04(ప్రజాస్వరం):**
జిన్నారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వివిధ వార్డు సభ్యులతో విస్తృత స్థాయి ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి వార్డుకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రజల ఆశలు ఆకాంక్షలపై సభ్యుల నుంచి వివరాలు సేకరించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పాల సాయి కుమార్, జిన్నారం ఇన్‌చార్జ్ ఐలాపూర్ మాణిక్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ నాయకుడు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రతి వార్డులో పార్టీ బలాన్ని పెంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.

## గో 25ను సవరిస్తూ హేతుబద్ధీకరణ
# ప్రక్రియను చేపట్టాలి



- డీఎస్సీ 2003 గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్

**గజ్వేల్ ఫిబ్రవరి 04 (ప్రజాస్వరం) :**
జీవో నెంబర్ 25 సవరణ చేస్తూ హేతుబద్ధీకరణ చేపట్టాలనీ ఈరోజు సాయంత్రం గజ్వేల్ మండల కేంద్రంలో 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు కుకునూరి శేఖర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవుల్లో GO నెంబర్ 25 ను ఇంప్లిమెంటేషన్ లో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో రేషనాలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని చూస్తుందని దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా దూరమవుతుందన్నారు. ఒకవేళ ప్రభుత్వం రేషనలైజేషన్ చేయాలనుకుంటే జాతీయ విద్యా విధానం లో సూచించిన విధంగా 30 మందికి ఒక ఉపాధ్యాయుడు కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిలను పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక పాఠశాలల్లో హేతుబద్ధీకరణ చేయాలన్నారు .ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చూడాలని,తెలంగాణ రాష్ట్రంలో 20 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలు అధికముగా ఉన్నందున 20కి పైబడి ప్రతి 15 మంది విద్యార్థులకు అదనముగా ఒక ఉపాధ్యాయున్ని కేటాయింపు చేయాలని అంతేకాకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు (PSHM) పోస్టును మంజూరు చేస్తూ క్యాడర్ స్ట్రెంత్ ను నిర్ణయించి రేషనలైజేషన్ ప్రక్రియ నిర్వహించాలినీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు




## పల్లెపహాడ్ నిర్వాసితుల సమస్యల
# పరిష్కారమే నా ప్రథమ లక్ష్యం

- ఇంటింటి ప్రచారంలో వార్డు ప్రజల ఘన స్వాగతం
- 8వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గుగ్లోత్ రమేశ్

**గజ్వేల్, 04 ఫిబ్రవరి (ప్రజాస్వరం):**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు (పల్లెపహాడ్)లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి గుగ్లోత్ రమేష్ బుధవారం ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గుగ్లోత్ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఉద్ఘాటించారు. ముఖ్యంగా 8వ వార్డు (పల్లెపహాడ్) అనేది ముంపు గ్రామం అని, ఇక్కడ సర్వం కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్టాలు తనకు తెలుసని, ఈ ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రతి సమస్యను తన సొంత సమస్యగా భావించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు ప్రజలకు తాను 24 గంటలూ అందుబాటులో ఉంటానని, ప్రధానంగా సిసి రోడ్లు, మంచినీటి సమస్య, వృద్ధాప్య పింఛన్లు, మరియు రేషన్ కార్డుల వంటి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. అలాగే, ఇప్పటివరకు ప్యాకేజీలు రాని నిర్వాసితులకు న్యాయం జరిగేలా, వారికి ప్యాకేజీలు వచ్చేలా పోరాడుతానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర గుప్తా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమేష్ యాదవ్, బాబు, కరుణాకర్, ఆంజనేయులు, భూపాల్, దేవేందర్, బిక్షపతి, రాజు, రాములు మరియు కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గోకుల్ ఫంక్షన్ హాల్
# ప్రారంభానికి సిద్ధం



- పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో కళ్యాణ మండపాలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఫిబ్రవరి 04(ప్రజా స్వరం) :**
పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న గోకుల్ ఫంక్షన్ హాల్ పనులు పూర్తయ్యాయని, అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం గోకుల్ నగర్‌లో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు కోట్ల రూపాయలతో అత్యాధునిక వసతులు, విశాలమైన హాళ్లు, సౌకర్యవంతమైన గదులతో ఈ ఫంక్షన్ హాల్‌ను నిర్మించినట్లు తెలిపారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు తక్కువ ఖర్చుతో వివాహాలు, శుభకార్యాలు నిర్వహించుకునేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని, కుల పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి అతి త్వరలో గోకుల్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, యాదవ సంఘం ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్, రాజన్ సింగ్, జిహెచ్ఎంసి ఏఈ లావణ్యతో పాటు పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## గడ్డపోతారం ఎన్నికల్లో
# బీఆర్ఎస్ విజయం ఖాయం



- మాజీ మంత్రి హరీష్ రావు

**గడ్డపోతారం, ఫిబ్రవరి 04 (ప్రజా స్వరం) :**
గడ్డపోతారం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మాదారం గ్రామంలో మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 10వ వార్డు లక్ష్మగౌని మహేందర్ గౌడ్, 11వ వార్డు జలగరి మల్లేష్, 12వ వార్డు ఠాకూర్ స్వాతి గణేష్, 13వ వార్డు కుత్తడి నవీన్‌లకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. పాలనలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై దౌర్జన్యాలు చేస్తోందని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గడ్డపోతారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, పటాన్చెరు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు, అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేదునూరి మాట

- సౌభ్రాతృత్వం
- మత సామరస్యత
- ప్రపంచ ప్రగతికి సోపానం

**కరీంనగర్/ హైదరాబాద్( ప్రజా స్వరం):**



ప్రపంచ మతాల మధ్య
అవగాహన పెంచడమే ధ్యేయంగా
ఫిబ్రవరి 4న ఐ రా స అంతర్జాతీయ
మానవ సౌభ్రాతృత దినోత్సవాన్ని
నిర్వహిస్తుంది

ప్రపంచంలో మత సామరస్యత
అంతరించింది మానవత్వం
మాయమైంది
రాక్షసత్వం రాజ్యమేలుతుంది

ఉగ్రవాదం ఉరకలేస్తుంది
అగ్రవాధం అర్రులు చాస్తూంది
అహంకారం అలంకరణైంది
ఆధిపత్యం ఆభరణమైంది
అంతర్జాతీయ ఉద్రిక్తతలు
ఉరకలు వేస్తున్నాయి

అంతర్జాతీయ చట్టాల అమలు
విస్మరణకు గురై యుద్ధ
వాతావరణం నెలకొన్నది

కులతత్వం మతతత్వం
సమాజ జీవనశైలియై
స్వార్థం సంకుచితత్వం
అక్రమాలు అరాచకాలు
అవినీతి దోపిడీ పెరిగింది

నేరమయ రాజకీయాలు
పెరిగి ధనం మూలం జగత్
అనే నానుడి మానవ జీవన
విధానమైంది

మానవ సంభందాలు
రక్తసంభంథాలు పగలు
ప్రతీకారాలలో భంధీ
అవుతున్నాయి

అవినీతి నీతి అయ్యింది
ప్రేమానురాగాలు అంతరించాయి
ప్రార్థించే చేతుల కన్న
సాయంచేసే చేతులు మిన్న

మతాలు వేరైనా మానవత్వం
ఒకటే మతం కన్నా మమత మిన్న
మనుషులంతా ఒకటే
మమకారమే మన బాట కావాలి.
విద్వేషపు గోడలు కూల్చుదాం
సద్భావనను చాటుదాం

ప్రపంచీకరణ నేపథ్యంలో
భౌతిక దూరంతో బాధ్యతలు
విస్మరించే మనుషుల సంఖ్య
పెరిగింది భౌతిక దూరం
మానవతను తుంచింది

కరోనా కాలంలో డాక్టర్లు నర్సులు
ప్రాణాధాతలై పారిశుధ్య కార్మికులు
కరెంట్ కార్మికులు సామాజిక
సైనికులై మీడియా జర్నలిస్టులు
బాధ్యతాయుత మల్లెలై
రోడ్డు పొడువునా ద్రాతృత్వంతో
చేయందించిన మహోన్నతుల
మానవత్వం కావాలి

ఆకలి పేదరికం నిరక్షరాస్యత
నిరుద్యోగం బాలకార్మిక వ్యవస్థ
మహిళలపై అత్యాచారాలు
మాదకద్రవ్యాల కట్టడి ప్రకృతి
పర్యావరణ రక్షణ మానవ
హక్కుల రక్షణే మానవాళి
ధ్యేయం కావాలి

ప్రపంచ ఉగ్రవాదాన్ని అరికట్టే
మానవీయత కుపెద్ద పీటవేయాలి
విశ్వ మానవ సౌభ్రాతృత్వంతో
జగతి పులకరింపగ మానవత్వపు
కుసుమాలు పరిమళాలు వెదజల్లగ

మానవీయతను తట్టి లేపే
కరుణ సహకారం సౌభ్రాతృత్వ
ఆశావహ దృక్పథంతో
సమాజ ఉజ్వల భవిష్యత్
నిర్మాణంతో చీకటిలో
ఆశాజ్యోతిని వెలిగిద్దాం
వసుదైక కుటుంభం నిర్మిదాం

మానవీయత పరివ్యాప్తితో
మత సామరస్యాన్ని పాటిద్దాం
మత సహనం సద్భావన
సౌభ్రాతృత్వం సంఘీభావంతో
ప్రపంచ ప్రగతికి పురోగతికి
పాటుపడుధాం.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనమిక్ ఫోరమ్
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్ 9440245771

## సమిష్టిగా పనిచేసే వారినే
# గెలిపించాలి



- బీఆర్ఎస్ పార్టీ నాయకులు సమిష్టిగా పనిచేసే
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి
- తాండూర్ లో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం

**తాండూరు, ఫిబ్రవరి 4(ప్రజా స్వరం) :**
మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పైలెట్ రోహిత్ రెడ్డి బుధవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 24 వ వార్డు లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొత్రిక నాగలక్ష్మి కి మద్దతుగా, అలాగే ఒకటవ వార్డులో నాగలక్ష్మి కి మద్దతుగా, 23వ వార్డులో పరిమళకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ముఖ్య నాయకులు కార్యకర్తలతో భేటీ అయ్యారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. భారీ మెజారిటీతో కొత్రిక నాగలక్ష్మి ని గెలిపించాలని అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రిక విజయ లక్ష్మి గారి అనుభవం వార్డు అభివృద్ధి కి తోడువుతుందని నాగలక్ష్మి ని కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు అభివృద్ధి చెందుతుందని అన్నారు.వార్డులోని పలువురు ముఖ్య వ్యక్తుల ఇంటికి వెళ్ళి నాగలక్ష్మి కి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.

# విద్యుత్ షాక్‌తో యువ రైతు మృతి

**దౌల్తాబాద్ ఫిబ్రవరి 4 ( ప్రజాస్వరం) :**



రాయపోల్ మండలంలోని అనాజీపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై యువ రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనాజీపూర్ గ్రామానికి చెందిన వెంకని స్వామి (35) వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో, కౌలుకు తీసుకున్న జంగం లింగం పొలంలో పారతో ఒరం తీస్తుండగా, బోర్ మోటార్ స్టార్టర్‌కు సంబంధించిన విద్యుత్ వైర్ పారకు తగిలింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి స్వామి అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. కొద్దిసేపటి తర్వాత పొలం వద్దకు వచ్చిన తండ్రి రాజయ్య కుమారుడు పడిపోయి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న వారు పరిశీలించగా, స్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ కుంచం మానస తెలిపారు.

# అక్రమ మట్టి దందా.. 5 టిప్పర్ లు ఇటచ్ సీజ్



**తూప్రాన్ ఫిబ్రవరి 4 (ప్రజా స్వరం) :**

మనోహరాబాద్ మండలంలో తుమ్మ కుంట నుండి అక్రమంగా గ్రావెల్ (మట్టి) తరలిస్తున్న 5 టిప్పర్లు, 1 హిటాచి యంత్రం మరియు 1 లారీని పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు తూప్రాన్ సిఐ రంగా కృష్ణ తెలిపారు స్వాధీనం చేసుకున్నా. ఈ వాహనాలు అనుమతులు లేకుండా గ్రావెల్ మట్టి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వాహనాల డ్రైవర్లు మరియు యజమానులపై కేసు నమోదు చేశారు. తదుపరి చర్యల కోసం ఈ కేసును కోర్టుకు పంపించారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడకూడదని పోలీసులు సూచించారు. అనుమతి లేకుండా గ్రావెల్ లేదా ఇతర ఖనిజాలను తరలించడం చట్టవిరుద్ధమని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పనులు జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ రంగా కృష్ణ హెచ్చరించారు.

# మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ప్రారంభం

- **జిల్లాలో మహిళల భద్రతకు, రక్షణకు మొదటి ప్రాధాన్యత**
- **ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిశీలన**
- **రిబ్బన్ కట్ నూతన గదిని ప్రారంభించిన మహిళా కానిస్టేబుల్**
- **రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచన**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**

**ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (ప్రజాస్వరం) :**

జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్ఠంగా నిర్వహిస్తున్నట్లు, జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను కేటాయిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర పనుల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని జిల్లా ఎస్పీ శాస్త్రోక్తంగా, వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేకంగా మహిళా కానిస్టేబుల్ చే రిబ్బన్ కట్ చేపించి నూతన గదిని ప్రారంభించారు. అదేవిధంగా సిబ్బంది విశ్రాంతికి పురుషులకై ప్రత్యేకంగా మరొక విశ్రాంతి గదిని సైతం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ఐపిఎస్ మరియు ఇచ్చోడ సిఐ బండారి రాజు కలిసి ప్రారంభించారు. మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకై షీ టీం ఆధ్వర్యంలో పోలీసు అక్క ప్రారంభించి చిన్నారులకు మరింత దగ్గర అయిందని, మహిళల పట్ల జరుగు నేరాలపై పాఠశాలలు కళాశాలలు గ్రామ గ్రామాల మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరిచయం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఇచ్చోడ పోలీస్ స్టేషన్ ను పరిశీలించి రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు చేయాలని, ఎలాంటి పెండెన్సీ లేకుండా



బాధితుల సమస్యల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ సిబ్బందిని కేటాయించి సమస్యల పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తును పూర్తి చేసి కోర్టులలో చార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఇచ్చోడా సీఐ బండారి రాజు, ఎస్ఐ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిన నాయకులను గెలిపించండి



- **గజ్వేల్ మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ దే**
- **ఎమ్మెల్సీ యాదవ రెడ్డి**

**గజ్వేల్, 04 ఫిబ్రవరి (ప్రజాస్వరం):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కప్ప మమత పోచయ్య తరపున ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ, బిఆర్ఎస్ పాలనలోనే పట్టణాలు, పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా అభ్యర్థి కప్ప మమత పోచయ్య మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లేశం,ప్రభాకర్, స్వామి, ప్రవీణ్, చందు, కుమార్ తదితర నాయకులు, ఒకటో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వం



- **జనగణనలోనే కులగణన చేయాలి**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**

**ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (ప్రజాస్వరం) :**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బీసీ ప్రధానమంత్రి అని చెబుతూ బీసీలను రాజ్యాధికారానికి దూరం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు.బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30 2025న కేంద్ర కేబినెట్ జనగణన లోనే కులగణన నిర్వహిస్తామని చెప్పి జనవరి 22న కేవలం జనగణన కోసం నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కులగణన జరిపి దేశానికే రోల్ మోడల్ గా నిల్చమని, కులాల వారిగా వాటాలు తేల్చి రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించామని పేర్కొన్నారు.జనగణలో కేవలం ఎస్సీ ఎస్టీల జనగణ మాత్రమే చేస్తున్నారని అన్ని కులాలు, ఉప కులాల వారిగా నిర్ధారించి బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ ఫలాలు, ప్రత్యేక రాయితిలు కల్పించే అవకాశం ఉంటుందని మేమెంతో మాకంతా నినాదాన్ని తుంగలో తొక్కి దొడ్డి దారిలో రాజ్యాధికారానికి దూరం చేస్తుందని విమర్శించారు.రాష్ట్రంలోని బీసీ సంఘాలు బిజెపి ఎంపీలపై ఒత్తిడి పెంచి పార్లమెంట్లో చర్చ జరిపించే విధంగా ఒత్తిడిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అందూర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, నక్కలవాడ గ్రామ సర్పంచ్ అడప నవీన్ కుమార్, దన్నూర్ సర్పంచ్ ఎల్మ రోహిణి వినయ్ రెడ్డి, కుచలాపూర్ ఉపసర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, పన్నాల చమేందర్ రెడ్డి, కోలా ప్రశాంత్, తరుణ్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్

**ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 04 (ప్రజాస్వరం) :**



ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా జల్కె పాండురంగ్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో జల్కె పాండురంగ్ పేరును ప్రతిపాదించగా, హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గత కాలంలో మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తించి మరోసారి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కన్వీనర్ జల్కె పాండురంగ్ మాట్లాడుతూ, తనపై మరోసారి నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు. కార్యకర్తలందరినీ కలుపుకొని మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని స్పష్టం చేశారు.సమావేశంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, జల్కె పాండురంగ్ నాయకత్వంలో పార్టీకి మండలంలో మంచి ప్రజాదరణ లభించిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పార్టీ నేతలు




**తూప్రాన్, ఫిబ్రవరి 04 : (ప్రజా స్వరం ) :**

తూప్రాన్ మున్సిపల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తూప్రాన్ మున్సిపాలిటీ 16వ వార్డు అధ్యక్షులు బందెల నరేష్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి బుధవారం గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వీరిని నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు 16వ వార్డు అభ్యర్థి బొడ్డు జోష్నా వేణు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం. ప్రజలకు మెరుగైన సేవ చేయడానికి కాంగ్రెస్ పార్టీ వేదికగా పని చేస్తాను" అని తెలిపారు. ఈ పరిణామంతో తూప్రాన్ మున్సిపల్ రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానికంగా నేతల మార్పులు కొనసాగుతాయా అనే దానిపై కూడా ఆసక్తి నెలకొంది.

# జామియా మస్జిద్‌లో 'షబ్ ఏ బరాత్' సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

**నార్సింగి, ఫిబ్రవరి 04 (ప్రజా స్వరం) :**

ముస్లింలు ఎంతో మహత్తరమైన రాత్రి గా భావించే రాత్రి షబ్ ఎ బరాత్. ఈ రాత్రి ముస్లింలు మసీదుల్లో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. వచ్చే సంవత్సరం వరకు జరిగే జననాలు, మరణాలు, అందరికీ అంద బోయే భోగాల వివరాలను అల్లాహ్ ఈ రాత్రి దేవదూత లకు అందిస్తారని నమ్మకం. అలాగే మృతి చెందిన వారిలోని పెద్ద సంఖ్య లో పాపులను క్షమించి, వారికి స్వర్గ ప్రాప్తి కలగ చేస్తాడని నమ్ముతారు. అందుకే తమకు తమ ఆత్మీయులకు సకల మానవాళి కి మేలు జరగాలని, పూర్వీకులకు మోక్షం జరిగి స్వర్గ లోక ప్రాప్తి కలగాలని మసీదుల లో జాగారం చేసి ప్రార్థిస్తారు. అనంతరం రాత్రి వేళలో ఖబ్రస్తాన్ కు వెళ్లి మరణించిన వారి స్వర్గ లోక ప్రాప్తి కోసం ప్రార్థనలు చేస్తారు. మండల పరిధిలోని అన్ని మసీదులను మంగళవారం షబ్ ఎ బరాత్ సందర్భంగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణ కేంద్రంలోని జామియా మస్జీద్ లో కూడా ప్రత్యేక ప్రార్థనలు, మస్జిద్ లో ఖురాన్ అభ్యసిస్తున్న బాల బాలికల తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా మస్జీద్ అధ్యక్షుడు ఎండీ చాంద్ ఖురేషి అధ్యక్షతన ఏర్పాట్లు చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలకు బహుమతులను అందజేశారు. షబ్ ఎ బరాత్ పర్వ దినాన మస్జిద్ ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక కార్యక్రమం కోసం పిల్లలకు తర్ఫీదు నిచ్చిన మస్జిద్ ఇమామ్ అహ్మద్ రజా ను సన్మానించారు. చిన్న పిల్లలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనడం పట్ల పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అకౌంటెంట్ సలీం షేక్, బాబు ఖురేషి, గుల్ఫోజ్, ఫరీద్, జమీర్, గౌస్, బాఖర్ పాషా, జహీర్, ముజీబ్, ఏజాజ్ గ్రామ మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999